

కుమారుడితో కలిసి
తల్లి ఆత్మహత్యాయత్నం
ఇద్దరినీ కాపాడిన పోలీసులు
కుటుంబీకులకు ఎస్ఐ కౌన్సెలింగ్
నర్సాపూర్ రాయరావు చెరువు వద్ద ఘటన
8

అంబేడ్కర్ జయంతి వేడుకల్లో నిర్మలాజగ్గారెడ్డి





సంగారెడ్డిలోని అంబేడ్కర్ భవన్‌లో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న నిర్మలాజగ్గారెడ్డి, పాత బస్టాండ్ వద్ద నిర్వహించిన వేడుకల్లో టీజీఐఐసీ చైర్‌పర్సన్

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జయంతి వేడుకల్లో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి పాల్గొన్నారు. ఈ మేరకు సంగారెడ్డి పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద ఆయన విగ్రహానికి, చిత్రపటానికి పూల మాల వేసి నివాళులుఅర్పించారు. అంతకు ముందు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్మలాజగ్గారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మహనీయుల చరిత్రను చదవాలని సూచించారు. మహనీయుల చరిత్రను తెలుసుకోవడం వల్ల జ్ఞానం పెరుగుతుందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చూపిన మార్గంలో నడవాలన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన మహోన్నత వ్యక్తి బాబా సాహెబ్ అంబేడ్కర్ అని నిర్మలాజగ్గారెడ్డి కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, టీపీసీసీ కార్యదర్శి తోపాజి అనంతకిషన్, నాయకులు కూన సంతోష్‌కుమార్, సతీష్‌రెడ్డి, మహేష్, వెంకట్‌రాజు, రామ్ రెడ్డి, రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

నిక్కర్ల స్థానంలో ప్యాంట్లు !

జూన్ నుంచి 6, 7వ తరగతి బాలురకు

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విద్యనభ్యసించే బాలురకు ప్యాంట్లు అందించాలని సర్కారు నిర్ణయించింది. గతంలో 1 నుంచి 7 వ తరగతి వరకు విద్యార్థులకు నెక్కర్లు, 8వ తరగతి నుంచి 10వ తరగతి వరకు యూనిఫామ్‌గా ప్యాంట్లు వేసుకునే వారు. అయితే 6, 7 తరగతి విద్యార్థులు నిక్కర్లతో అసౌకర్యానికి గురవడంతో పాటు తరగతులకు హాజరయ్యేందుకు ఇష్టపడటం లేదు. ఇలాంటి సమస్యలను గుర్తించిన ప్రభుత్వం వారికి కూడా ప్యాంట్లు అందించాలని నిర్ణయించింది. ఈ విద్యాసంవత్సరం నుంచే 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు యూనిఫామ్‌గా బాలురందరికీ ప్యాంటు అందించనున్నారు. రెండు జతల చొక్కలు, ప్యాంట్లు పంపిణీ చేయనున్నారు. యూనిఫామ్ కుట్టుకూలి బాధ్యతలను ప్రభుత్వం స్వయంసహాయక సంఘాలకు అప్పగించిన విషయం తెలిసిందే. యూనిఫామ్‌కు సంబంధించిన వస్త్రం (క్లాత్) ఈ వారంలో జిల్లాకు చేరనుండగా ఎస్‌హెచ్‌జీలు తీసుకునే కొలతల ఆధారంగా విద్యార్థులందరికీ యూనిఫామ్ కుట్టించి బడులు ప్రారంభానికి నాటికి సిద్ధం చేయాలని విద్యాశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు.



విద్యార్థుల యూనిఫామ్ కొలతలు తీసుకుంటున్న దృశ్యం(ఫైల్)

రోడ్డు కబ్జాకు యత్నం

రియల్టర్‌పై తిరగబడ్డ పాటి గ్రామస్థులు

పోలీసుల రంగ ప్రవేశంతో సద్దుమణిగిన గొడవ

పటాన్‌చెరు రూరల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : ఓ రియల్టర్ రోడ్డు కబ్జాకు ప్రయత్నించడంతో గ్రామస్థులంతా తిరగబడ్డ ఘటన పటాన్‌చెరు రూరల్ పరిధిలోని పాటి గ్రామంలో చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళితే.. పాటి గ్రామం ఆనంద్ నగర్ కాలనీవాసులకు చెందిన భూములు కొంతకాలంగా వివాదంలో చిక్కుకున్నాయి. న్యాయం కోసం అధికారులు, కోర్టుల చుట్టూ తిరిగి నిర్మాణాలకు అనుమతులు సైతం తెచ్చుకున్నా, స్థానికంగా అడ్డంకులు కల్పిస్తూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో 185 సర్వే నంబర్‌లో కాలనీకే చెందిన దాదాపు 30 ప్లాట్లను ఓ స్థానిక రాజకీయ నేత అండతో రియల్టర్ కబ్జా చేశారు. సదరు స్థలం చుట్టూ బ్లూ షీట్స్ ఏర్పాటు చేసి సెక్యూరిటీ పెట్టి ప్లాట్ ఓనర్స్‌ని తమ ప్లాట్లలోకి రాకుండా అడ్డుకున్నాడు. దీనికి ఆనుకుని ఉన్న రోడ్డును కూడా కబ్జా చేయడానికి ప్రయత్నించడంతో ఆనంద్‌నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులతో పాటు, గ్రామస్థులు అక్కడికి చేరుకుని అడ్డుకున్నారు. సమాచారం అందుకున్న బీడీఎల్ సీఐ స్వామిగౌడ్ తన సిబ్బందిని సంఘటన స్థలానికి పంపించి ఇరు వర్గాలు పోలీస్‌స్టేషన్‌కి వచ్చి మాట్లాడాలని సూచించడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. తమ ప్లాట్లకు హెచ్‌ఎండీఏ అనుమతితో పాటు, ఎల్ఆర్ఎస్, జిల్లా కోర్టు నుంచి ఇంజక్షన్ ఆర్డర్ కూడా ఉందని, అయినా తమపై దౌర్జన్యం ప్రదర్శిస్తూ సర్వే నంబర్‌ను వేరుగా చూపిస్తూ ప్లాట్లను కబ్జా చేశాడని ఆనందనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ఆరోపించారు. ఈ మేరకు కాలనీ అసోసియేషన్ నాయకులు సదరు రియల్టర్‌పై ఫిర్యాదు చేయటానికి జిల్లా ఎస్పీ కార్యాలయానికి వెళ్లారు. కాగా రాజకీయ నేతలు రోడ్డు జోలికి వెళ్లొద్దని చెప్పడంతో రియల్టర్ వెనకడుగు వేసినట్టు సమాచారం.



కబ్జాను అడ్డుకుంటున్న స్థానికులు



ప్లాట్లలో ఏర్పాటు చేసిన బ్లూ షీట్స్‌ను పరిశీలిస్తున్న పోలీసులు

ఆర్టీసీ డిజిటల్ సేవలు

టికెట్ల జారీకి నగదు రహిత విధానం

రిజర్వేషన్ బస్సుల్లో అందుబాటులో ఐ-టిమ్స్

చిల్లర సమస్యకు చెక్.. దశల వారీగా విస్తరణ

మెదక్ అర్బన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : టీజీ ఆర్టీసీ బస్సుల్లో నగదు రహిత సేవలకు శ్రీకారం చుట్టింది. ప్రయాణికులకు ఆర్టీసీ సేవలను మరింత విస్తృతంగా అందించేందుకు అధికారులు డిజిటల్ పేమెంట్స్‌లో టికెట్ల జారీ ప్రక్రియను ప్రారంభించారు. దీంతో బస్సుల్లో ప్రయాణికులు, కండక్టర్లు టికెట్ల సమయంలో ఎదుర్కొంటున్న చిల్లర సమస్యలకు తెరపడనుంది. మెదక్ డిపోలో ఈ సేవలను డీఎం సురేఖ గత నెల లాంఛనంగా ప్రారంభించారు. ప్రస్తుతం శ్రీశైలం సర్వీసుకు ఈ సేవలు అందిస్తుండగా.. అతి త్వర్వలో మెదక్ నుంచి హైదరాబాద్‌తోపాటు పలు ప్రాంతాలకు వెళ్లే అన్ని సర్వీసులకు విస్తరిస్తామని వెల్లడించారు.



మెదక్‌లో సూపర్ లగ్జరీ బస్సులో క్యూఆర్ కోడ్ ద్వారా నగదు చెల్లిస్తున్న ప్రయాణికుడు

క్యూఆర్ కోడ్‌తో

బస్సుల్లో టిమ్ మిషన్‌లోని క్యూఆర్ కోడ్‌ను ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం వంటి మొబైల్ యాప్‌లతో స్కానింగ్ చేసి నేరుగా టికెట్ చార్జీలను చెల్లించవచ్చు. క్రెడిట్, డెబిట్ కార్డులను ఉపయోగించే విధంగా ఆధునిక టిమ్ యంత్రాలను రిజర్వేషన్ బస్సుల్లో ప్రవేశపెట్టారు. త్వరలో మెదక్, నర్సాపూర్‌లోని డీలక్స్ 18, ఎక్స్‌ప్రెస్ 13, పల్లెవెలుగు 85 బస్సుల్లో సైతం ఈ నగదు రహిత చెల్లింపు విధానం అమలుకు ఆర్టీసీ సన్నద్ధమవుతుంది.

రెండు డిపోలకు 100 ఐ-టిమ్ మిషన్లు

ఆర్టీసీ బస్సుల్లో నగదు రహిత సేవలను విస్తృత పరిచేందుకు మెదక్ డిపోకు 80, నర్సాపూర్ డిపోకు 20 ఐ-టిమ్ మిషన్లు (ఇంటిలిజెన్స్ టికెట్ ఇష్యూ మిషన్) కేటాయించారు. ఈ మిషన్లలో 4జీ నెట్‌వర్క్ సిమ్‌కార్డు అమర్చి ఉంటుంది. ఇంటర్నెట్ సహకారంతో డిజిటల్ పేమెంట్స్‌లో టికెట్లను జారీ చేస్తారు. ఈ టిమ్ మిషన్ల ఆపరేటింగ్‌పై ఆర్టీసీ డ్రైవర్లకు అధికారులు శిక్షణ ఇచ్చారు.

అన్ని బస్సుల్లో అమలు చేస్తాం



ప్రయాణికుల సౌకర్యార్థం శ్రీశైలం వెళ్లే బస్సులో డిజిటల్ పేమెంట్‌లో టికెట్ జారీ ప్రక్రియను ప్రారంభించాం. చిల్లర సమస్య ఉండదు. ఏ సర్వీస్‌లో ఎన్ని సీట్లు ఉన్నాయో, ప్రతీది రికార్డ్ అవుతుంది. దశల వారీగా అన్ని సర్వీసుల్లో అమలు చేస్తాం. ప్రయాణికులు నగదు రహిత సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

\- సురేఖ, మెదక్ డీఎం

నెత్తురోడిన రహదారులు
వేర్వేరు ప్రమాదాల్లో నలుగురి మృతి
17 మందికి తీవ్రగాయాలు,
ముగ్గురి పరిస్థితి విషమం
సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లో ఘటనలు
6



ఓఆర్ఆర్‌పై నుజ్జునుజ్జైన టెంపో ట్రావెలర్

ప్రవచనానికి వస్తే..
టెంటు కూలి గాయాలు
నరేంద్రాచార్య పాదుకపూజలో
గాలిదుమారం బీభత్సం
25 మందికి భక్తులకు గాయాలు
సిర్గాపూర్ మండలంలోని వాసర్‌లో ఘటన
7



వైభవంగా బీరప్ప ఉత్సవాలు

తెల్లాపూర్‌లో నిర్వహిస్తున్న బీరప్పస్వామి కామరాతి అమ్మవార్ల కల్యాణ మహోత్సవాల్లో సోమవారం మాజీ మంత్రి హరీశ్‌రావు, బీఆర్ఎస్ పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదర్శరెడ్డి, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, కార్పొరేటర్ మెట్టుకుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆలయ నిర్మాణానికి స్థలం కావాలని కోరడంతో అప్పట్లో మంజూరు చేశామని ఈ సందర్భంగా హరీశ్‌రావు గుర్తుచేశారు.

\- రామచంద్రాపురం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి)

‘యూడైస్ ప్లస్’ వివరాలు పక్కానా?

పాఠశాలల్లో పరిస్థితులపై క్షేత్ర స్థాయిలో సర్వే

రంగంలోకి బీఈడీ, డీఈడీ విద్యార్థులు

నేటి నుంచి 21 వ తేదీ వరకు పరిశీలన

710 బడుల్లో 52 మంది తనిఖీలకు..

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో యూడైస్ ప్లస్‌కు అనుగుణంగా విద్యార్థులున్నారా? వసతులు, సౌకర్యాలు ఏమేమి ఉన్నాయనే దానిపై క్షేత్ర స్థాయిలో సర్వే చేయాలని విద్యాశాఖ నిర్ణయించింది. ఇందు కోసం బీఈడీ, డీఈడీ విద్యార్థులను రంగంలోకి దింపనున్నారు. ఈ నెల 15 నుంచి 21వ తేదీ వరకు కేటాయించిన పాఠశాలలకు వెళ్లి వివరాలు సేకరించి నివేదిక సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదిస్తారు.

మొదట థర్డ్ పార్టీతో సర్వే

పాఠశాలలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని యూడైస్ ప్లస్ (డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టం ఫర్ ఎడ్యుకేషన్ ప్లస్)లో ప్రధానోపాధ్యాయులు నమోదు చేసిన సమాచారంపై విద్యాశాఖ తొలిసారిగా థర్డ్ పార్టీతో వెరిఫికేషన్ చేయిస్తోంది. ఎంపిక చేసిన పాఠశాలల్లో బీఈడీ, డీఈడీ విద్యార్థులు పాఠశాలలను తనిఖీ చేసి వాస్తవ పరిస్థితులు పరిశీలించి ధ్రువీకరిస్తారు. వాస్తవానికి యూడైస్ ప్లస్‌లో పాఠశాలకు సంబంధించి విద్యార్థులు, ఉపాధ్యాయుల సంఖ్య, ఖాళీల వివరాలు, మౌలిక వసతులు, ఆధార్ అనుసంధానం, మధ్యాహ్న భోజన పథకం, యూనిఫామ్, పాఠ్యపుస్తకాల సరఫరా తదితర వివరాలు ఇందులో ఎప్పటికప్పుడు పొందుపర్చుతారు. యూడైస్ ప్లస్‌కు అనుగుణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా పాఠశాలలకు బడ్జెట్‌ను కేటాయిస్తుండడంతో పాటు ఉపాధ్యాయ పోస్టులు మంజూరు చేస్తున్న తరుణంలో ఈ సర్వేకు ప్రాధాన్యం సంతరించుకున్నది.



సంగారెడ్డిలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల

710 స్కూళ్లలో మళ్లీ పరిశీలన

సంగారెడ్డి జిల్లాలోని 710 ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 52 మంది బీఈడీ, డీఈడీ విద్యార్థులు క్షేత్రస్థాయిలో వెళ్లి ఆరా తీస్తారు. జిల్లావ్యాప్తంగా 1247 పాఠశాలలున్నప్పటికీ 710 బడుల్లో మాత్రమే సర్వే చేయాలని ఆదేశాలు వచ్చాయి. అంటే ఆ 710 పాఠశాలల్లో వివరాలు తప్పుగా నమోదు చేసినట్టు తెలుస్తోంది. అందుకే మరోసారి సర్వేకు విద్యాశాఖ చర్యలకు ఉపక్రమించింది. యూడైస్ ప్లస్‌లో నమోదైన సంఖ్య మేరకు విద్యార్థులున్నారా? లేరా? అని పరిశీలిస్తారు. 1 నుంచి 10వ తరగతి వరకున్న పాఠశాలల్లో ఒక్కో బీఈడీ, డీఈడీ విద్యార్థికి రోజుకు రెండేసి చొప్పున 10 పాఠశాలలను సందర్శిస్తారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉంటున్నా యూడైస్ ప్లస్‌లో మాత్రం కొంత ఎక్కువగా నమోదు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఏటా నిధులు తక్కువగా మంజూరవుతాయనే కారణంతో విద్యార్థుల సంఖ్య, వసతులు, సౌకర్యాల వివరాలు తప్పుగా నమోదు చేస్తున్నట్టు విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు సర్కారు ఈ నిర్ణయం తీసుకుంటున్నట్టు విద్యాశాఖ అధికారులు తెలిపారు.

కుమారుడితో కలిసి తల్లి ఆత్మహత్యాయత్నం

● ఇద్దరిని కాపాడిన పోలీసులు ● కుటుంబీకులకు ఎస్ఐ కౌన్సెలింగ్

నర్సాపూర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలతో వివాహిత తన నాలుగేళ్ల కుమారుడితో కలిసి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించగా.. పోలీసులు కాపాడారు. ఎస్ఐ లింగం వివరాల ప్రకారం.. నర్సాపూర్‌కు చెందిన మన్నె అనిల్, జయమ్మ భార్యాభర్తలు. వీరికి కుమారుడు(4) ఉన్నాడు. కుటుంబ కలహాలతో జయమ్మ కుమారుడితో కలిసి సోమవారం స్థానిక రాయరావు చెరువు వద్దకొచ్చింది. చెరువులోకి అనుమానాస్పదంగా వెళ్తున్న విషయాన్ని గమనించిన అక్కడి వాచ్‌మన్ పోలీసులకు సమాచారమందించాడు. హెడ్ కానిస్టేబుల్ పాండరి, కానిస్టేబుల్ భిక్షపతి హుటాహుటిన అక్కడికి వెళ్లి ఇద్దరినీ కాపాడి పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఎస్ఐ లింగం భర్త అనిల్‌తో పాటు అనిల్ తండ్రి యాదగిరిని పిలిపించి కౌన్సెలింగ్ ఇప్పించారు. ఏదైనా సమస్య ఉంటే పరిష్కరించుకోవాలని సూచించారు.


ఆత్మహత్య చేసుకునేందుకు వచ్చిన తల్లి, కుమారుడు

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురి మృతి

● 17 మందికి తీవ్రగాయాలు, ముగ్గురి పరిస్థితి విషమం ● ఉమ్మడి జిల్లాల్లో ఘటనలు




రామచంద్రాపురం : మృతిచెందిన డ్రైవర్ మాధయ్య, నుజ్జునుజ్జైన టెంపో ట్రావెలర్,
కొండపాక: కారులో ఇరుక్కుపోయిన వారిని బయటకు తీస్తున్న అంబులెన్స్ సిబ్బంది

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతిచెందగా.. 17 మందికి తీవ్రగాయాలయ్యాయి. ఇందులో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నది. ఈ సంఘటనలు సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లో సోమవారం చోటు చేసుకున్నాయి.

రామచంద్రాపురం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : ఓఆర్ఆర్‌పై టెంపో ట్రావెలర్ అదుపుతప్పి విద్యుత్ స్తంభానికి ఢీకొట్టింది. ఈ ఘటనలో డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందగా.. ఒకే కుటుంబానికి చెందిన 12 మందికి గాయాలయ్యాయి. సీఐ రవీందర్ వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రంలోని బీదర్ పట్టణానికి చెందిన ధన్‌రాజ్(58) కుటుంబసభ్యులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుమల తిరుపతి ఆలయానికి టెంపో ట్రావెలర్‌లో బయలుదేరారు. ట్రావెల్ యజమానికి మాధయ్య(42) డ్రైవర్‌గా ఆదివారం రాత్రి 10:30లకు బీదర్ నుంచి బయలుదేరారు. సోమవారం ఉదయం 2 గంటల సమయంలో కొల్లూరు ఓఆర్ఆర్ వద్దకు వచ్చేసరికి ముందు వెళ్తున్న మరో వాహనాన్ని తప్పించబోయి వీరి వాహనం అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో మాధయ్య అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. విషయం తెలుసుకున్న కొల్లూరు పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. టెంపోలో ఉన్న ధన్‌రాజ్(58), హరికిషన్ హజారే(45), అనుష్క(12), అయిషీ హజారే(15), అమృత(30), దీపక్(35), ఆరాధ్య(4), సవితభాయి(60), శిల్పరాణి(34), ఆర్‌పీ ఠాకూర్(47), అజయ్‌సింగ్ ఠాకూర్(54), జీవన్‌భాయ్(50)లను బయటకు తీసి నగరంలోని యశోద ఆసుపత్రి హైటెక్ సిటీ శాఖకు తరలించారు. కాగా ధన్‌రాజ్(58), హరికిషన్ హజారే (45), అనుష్క(12)ల పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ రవీందర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వంట మనిషి..

రామచంద్రాపురం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఓ వంట మనిషి దుర్మరణం చెందిన ఘటన కొల్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఉస్మాన్‌నగర్‌లో సోమవారం చోటు చేసుకుంది. సీఐ రవీందర్ కథనం ప్రకారం... గల్‌మోహర్ కాలనీకి చెందిన ప్రభాకర్(55) సోమవారం సాయంత్రం 3 గంటల సమయంలో రోజు మాదిరిగానే బైక్‌పై తెల్లాపూర్ నుంచి ఉస్మానగర్‌వైపు వెళ్తున్నాడు. అతని వెంట మద్యం సేవించి టిప్పర్‌ను నడుపుతూ వస్తున్న డ్రైవర్ రాజ్‌పుష్ప మలుపు వద్ద బైక్‌ను ఓవర్ టేక్ చేసే క్రమంలో టిప్పర్‌ను బైక్‌పై నుంచి పోనిచ్చాడు. ఈ ఘటనలో ప్రభాకర్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. కొల్లూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారని సీఐ రవీందర్ తెలిపారు. అధికారులు ఓ ఎమ్మెల్సీ కోసం రోడ్డును ఒక్కసారిగా మలుపు తిప్పడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చెట్టును ఢీకొట్టిన ఘటనలో ఒకరు..

కొండపాక, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : అదుపుతప్పి కారు చెట్టుకు ఢీకొట్టడంతో ఒకరు మృతిచెందగా.. మరొకరికి తీవ్రగాయాలైన సంఘటన కొండపాక మండలం మర్పడగ శివారులో సోమవారం తెల్లవారుజామున జరిగింది. కామారెడ్డి జిల్లా కామారెడ్డి జిల్లా గాంధారి మండలం గండివేటు గ్రామానికి చెందిన నామాల అనిల్‌కుమార్(24) హైదరాబాద్ బొడుప్పల్‌లో నివాసముంటూ హోటల్‌లో పని చేస్తున్నాడు. అతడి స్నేహితుడు కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలం దేశాయిపేటకు చెందిన సాయిబాబాతో కలిసి సిద్దిపేటలో ఉంటున్న వారి స్నేహితులను కలవడానికి కారులో హైదరాబాద్ నుంచి కొండపాక మీదుగా సిద్దిపేట వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో మర్పడగ శివారులో కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. దీంతో అనిల్‌కుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. సాయిబాబాకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది శ్రీకాంత్, శ్రీనివాస్ అక్కడికి చేరుకుని రెస్క్యూటీమ్‌తో కలిసి రెండు గంటలపాటు శ్రమించి కారులో ఇరుక్కున్నవారిని బయటకు తీశారు. సాయిబాబాను చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ తెలిపారు.

వరుసగా ఢీకొన్న కార్లు, ట్రాక్టర్, నలుగురికి గాయాలు

కొండపాక, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : కొండపాక మండలం దుద్దెడ శివారులో రాజీవ్ రహదారిపై కలెక్టరేట్ సమీపంలో రెండు కార్లు, ట్రాక్టర్ వరుసగా ఢీకొట్టుకోవడంతో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. హైదరాబాద్‌కు చెందినవారు మంచిర్యాల వద్ద దైవ దర్శనం చేసుకుని తిరిగి హైదరాబాద్‌కు వెళ్తున్నారు. దుద్దెడ శివారులో కలెక్టరేట్ వద్ద వీరి కారును వెనక నుంచి వస్తున్న కారు బలంగా ఢీకొట్టింది. దీంతో కారు డివైడర్ అవతలి వైపునకు దూసుకెళ్లి ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న తన్మయి, గీత, రోహిత్, రుద్రాన్స్‌లకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది మహేందర్, రమేష్ ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేసి, సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

లారీని ఓవర్ టెక్ చేయబోయి...

పుల్‌కల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలం శివంపేట మంజీర నది వంతెనపై సంగారెడ్డి-నాందేడ్, అకోలా 161 జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం చేవేళ్ల గ్రామానికి చెందిన బేగరి జర్నయ్య(43) హైదరాబాద్‌లో ఉంటూ వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. స్వగ్రామమైన చేవేళ్లలో సోమవారం జరుగనున్న అంబేడ్కర్ జయంతిలో పాల్గొనేందుకు రాత్రి (టీఎస్ 07 జెటీ 2463) నంబరు గల బైక్‌పై హైదరాబాద్ నుంచి బయలుదేరాడు. శివంపేట మంజీర నది వంతెన వద్దకు రాగానే ముందు వైపు వెళ్తున్న (టీఎస్ 15 యూఎఫ్ 7643) నంబరు గల లారీని ఓవర్ టెక్ చేసే క్రమంలో వేగంగా ఢీకొట్టి రోడ్డుపై పడిపోయాడు. దీంతో తల, ముఖానికి గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య తుల్జమ్మ, కుమారుడు పవన్, కూతురు ఉన్నారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డి ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతుడి కుమారుడు పవన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పుల్కల్ ఎస్ఐ పాటిల్ క్రాంతికుమార్ తెలిపారు.


ప్రమాదంలో ధ్వంసమైన కారు

తాళం వేసిన ఇంట్లో చోరీ

● 8 తులాల బంగారం, ● రూ.లక్ష నగదు అపహరణ

మనూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : తాళం వేసిన ఇంట్లో పట్టపగలే చోరీ జరిగింది. ఈ సంఘటన సంగారెడ్డి జిల్లా మనూరు మండలం అతిమ్యాల్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గొల్ల వైద్యనాథ్ వ్యవసాయ పనుల నిమిత్తం పొలానికి వెళ్లగా, ఆయన కుమారుడు, కోడలు ఇతర గ్రామంలో జరుగుతున్న జాతరకు వెళ్లారు. ఇదే అదునుగా భావించిన గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి ఇంట్లోకి వెళ్లి 8 తులాల బంగారం, రూ.లక్ష నగదును ఎత్తుకెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చి చూసేసరికి తాళం పగులగొట్టి ఉండడంతో పోలీసులకు సమాచారమందించాడు. ఎస్ఐ శంకరయ్యస్వామి గ్రామానికి వెళ్లి పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం


సామగ్రిని అపహరించుకుపోయిన దుండగులు

అల్లాదుర్గం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : అల్లాదుర్గం మండలం చిల్వర్ గ్రామపంచాయతీ పరిధి గల కుసంబినగర్ శివారులో గుర్తు తెలియని దుండగులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి రూ.60 వేల సామగ్రి, ఆయిల్‌ను చోరీ చేసినట్లు ట్రాన్స్‌కో ఇన్‌చార్జి ఏఈ నవాజ్ సోమవారం తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేయడంతో ఆ ప్రాంతంలోని పంట పొలాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈ విషయమై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని తమ సిబ్బందికి సూచించామని నవాజ్ తెలిపారు.

లారీ నుంచి గ్యాస్ లీకేజీ



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

చేగుంట, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ లోడుతో వెళ్తున్న ట్యాంకర్ నుంచి ప్రమాదవశాత్తు గ్యాస్ లీకేజీ అయ్యింది. ఈ సంఘటన మెదక్ జిల్లా చేగుంట 44వ జాతీయ రహదారిపై సోమవారం చోటుచేసుకుంది. హైదరాబాద్‌లోని చర్లపల్లి నుంచి రాజస్థాన్‌కు గ్యాస్ లోడుతో ట్యాంక్ వెళ్తుంది. ఈ క్రమంలో చేగుంట వద్దకు రాగానే గ్యాస్ లీకయ్యింది. అప్రమత్తమైన డ్రైవర్ రామాయంపేట అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించాడు. ఫైర్ సిబ్బంది ప్రవీణ్, నవీన్‌గౌడ్, చంద్రగౌడ్, సత్తయ్య, శంకర్ మంటలు ఆర్పారు. దీంతో పెను ప్రమాదం తప్పింది.

ఓవర్ టేక్ విషయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ

నారాయణఖేడ్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : నారాయణఖేడ్ పట్టణంలో బైక్‌లపై వెళ్తున్న ఇరువురు ఓవర్ టేక్ విషయంలో గొడవకు పాల్పడి, రోడ్డుపై ఘర్షణకు దిగారు. ఇరువర్గాలకు చెందినవారు పరస్పరం దాడులకు పాల్పడడంతో కొద్దిసేపు ఉద్రిక్తత పరిస్థితి నెలకొన్నది. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పట్టణంలో ప్రతిరోజు సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు భారీ చప్పుడుతో కొందరు ఆకతాయిలు హల్‌చల్ చేస్తున్నారని, అయినా పోలీసులు పట్టించుకోవడం లేదని పలువురు పేర్కొన్నారు.



అంబేడ్కర్ జయంతి సందర్భంగా మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ ఆయన విగ్రహనికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అణగారిన సంక్షేమం కోసం అబేడ్కర్ చేసిన కృషి స్ఫూర్తిదాయమన్నారు.

- పటాన్‌చెరు రూరల్, ఆంధ్రజ్యోతి



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానీచంద్ర

అగ్నిప్రమాదాల నివారణకు జాగ్రత్తలు అవసరం

సంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానీచంద్ర

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదాల నివారణకు జాగ్రత్తలు అవసరమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానీచంద్ర అన్నారు. సంగారెడ్డిలోని అగ్నిమాపక కేంద్రంలో అగ్నిమాపక వారోత్సవాల కరపత్రాన్ని సోమవారం ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. అప్రమత్తతతోనే అగ్నిప్రమాదాలు నివారించవచ్చని పేర్కొన్నారు. స్టేషన్ ఫైర్ ఆఫీసర్ ఎస్.శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 20 వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అగ్నిభద్రత, ప్రమాద నివారణ, ఫైర్ డిపార్ట్‌మెంట్ సేవల గురించి అవగాహన కల్పించడమే వారోత్సవాల లక్ష్యమన్నారు. అంతకు ముందు స్మారక పరేడ్‌ను నిర్వహించి అగ్నిమాపక శాఖ త్యాగాలు, సేవలు, ప్రజా భద్రత కోసం నిబద్ధతకు నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఫైర్ స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి పోటీలో శ్రీశాంత్‌గౌడ్‌ను విజేతగా ప్రకటిస్తున్న రెఫరీ

జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు శ్రీశాంత్

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు సంగారెడ్డికి చెందిన శ్రీశాంత్‌గౌడ్ ఎంపికయ్యారు. సికింద్రాబాద్ లాలాపేటలోని ప్రొఫెసర్ జయశంకర్ మున్సిపల్ క్రీడా మైదానంలో ఈ నెల 11, 12న రెండు రోజుల పాటు జరిగిన 70-75 అండర్ 19 విభాగంలో రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలో శ్రీశాంత్‌గౌడ్ ఉత్తమ ప్రతిభ కనబర్చి బంగారు పతకాన్ని సాధించారు. ఈ పోటీల్లో విజయం సాధించడంతో ఉత్తర్‌ప్రదేశ్ గ్రేటర్ నోయిడాలో ఈ నెల 21 నుంచి 27 వరకు జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. జాతీయ స్థాయికి ఎంపికవడంపై బాక్సింగ్ కోచ్ ఆనంద్ భాస్కర్ హర్షం వ్యక్తం చేశారు.

మున్సిపల్ కార్మికుడు.. 60 సార్లు రక్తదానం



రక్తదానం చేసిన శ్రీకాంత్‌ను సన్మానిస్తున్న మున్సిపల్ కమిషనర్

అంబేడ్కర్ జయంతి.. వర్ధంతిలకు..

హుస్నాబాద్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను పురస్కరించుకుని ఇప్పటి వరకు 60సార్లు రక్తదానం చేశారు శ్రీకాంత్. హుస్నాబాద్ మున్సిపాలిటీలో సాధారణ కార్మికుడైన ఆయన ఈసారి అంబేడ్కర్ జయంతి సందర్భంగా వరంగల్‌లోని మదర్ థెరిసా బ్లడ్ బ్యాంక్‌లో మరోసారి రక్తదానం చేశారు. అంబేడ్కర్ జయంతి, వర్ధంతితో పాటు ఎవరికి రక్తం అవసరం వచ్చినా శ్రీకాంత్ రక్తదానం చేస్తుంటారు. ఈ విషయం తెలుసుకున్న హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ మున్సిపల్ కార్మికుడు శ్రీకాంత్‌ను ప్రత్యేకంగా అభినందించారు. శాలువాతో సత్కరించారు.

వైకుంఠంకు కళా ప్రతిభా అవార్డు

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జంతుశాస్త్ర విభాగంలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న జి. వైకుంఠం జాతీయ స్థాయిలో కళాప్రతిభా అవార్డు అందుకున్నారు. సౌత్ ఇండియన్ కల్చరల్ ఫెస్టివల్స్ ఉగాది పురస్కార అవార్డ్స్‌లో భాగంగా న్యూఢిల్లీలో కల్చరల్ ఫైన్ ఆర్ట్స్ ఫెడరేషన్, ఆది లీలా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కళాకారుడిగా, రచయితగా, గాయకుడిగా, సామాజిక కార్యకర్తగా చేసిన సేవలను గుర్తించి జాతీయ స్థాయిలో కళా ప్రతిభా అవార్డును అందజేశారు. ఢిల్లీ ఇన్‌కం టాక్స్ డిపార్ట్మెంట్ సూపరింటెండెంట్ డి. నాగేశ్వరరావు, శ్రీగాయత్రి ఫిలిమ్స్ సినీ నిర్మాత మంత శ్రీనివాస్, కల్చరల్ ఫైన్ ఆర్ట్స్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ జి. ప్రభాకర్‌రావు, కూచిపూడి నాట్యగురు సీత నాగజ్యోతి, ఢిల్లీ కల్చరల్ సలహాదారు అర్జున్, ఆది లీలా ఫౌండేషన్ ఎన్జీవో న్యూఢిల్లీ చైర్మన్ ఆదినారాయణ కనక సుధాకర్ తదితర ప్రముఖుల చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.



పులి గాండ్రింపు శబ్దంతో ఏర్పాటు చేసిన చార్జింగ్ స్పీకర్

వాటే.. ఐడియా

శివ్వంపేట, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కోతుల బారి నుంచి తన పంటను రక్షించుకునేందుకు ఓ రైతు వినూత్న ప్రయోగం చేశాడు. ఏకంగా పులి గాండ్రింపును రికార్డ్ చేసి.. చార్జర్ స్పీకర్‌లో ఆ గాండ్రిపు వినిపించేలా చేశాడు. దీంతో కోతుల గుంపు అటువైపు రాకుండా తోక ముడుస్తున్నాయి. మండల పరిధి టిక్యా దేవమ్మ గూడెం తండాకు చెందిన మూసావత్ రెడ్యానాయక్ ఎకరా భూమి కౌలుకు తీసుకుని అందులో పశువుల మేత కోసం సూపర్ నేపియర్ అనే రకం గడ్డిని సాగు చేస్తున్నాడు. గడ్డి ఏపుగా పెరిగింది. అయితే, ఈ గడ్డి మొదలు తియ్యగా ఉండటంతో కోతులు వచ్చి మొదలు కొరికి పడేస్తున్నాయి. దీంతో ఆ రైతు చార్జర్ స్పీకర్ ఏర్పాటు చేసి, దాంట్లో పులి గాండ్రిపు రికార్డు చేసి పెట్టాడు. దీంతో కొంత వరకు కోతుల నుంచి ఉపశమనం లభించిందని రైతు తెలిపారు.

తేలని 'మల్లన్న సాగర్' పంచాయితీ



త్రిబుల్ రోడ్డు పక్కన ఖాళీగా ఉన్న భూమిని ఇటీవల చదును చేసిన దృశ్యం

నిత్యం ఘటనలు.. తలలు పట్టుకుంటున్న అధికారులు

- ముట్రాజ్‌పల్లి భూయజమానులకు తప్పని తిప్పలు
- ఎటు తేల్చని రాష్ట్ర ప్రభుత్వం
- ఇబ్బందులకు గురవుతున్న నిర్వాసితులు

గజ్వేల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): మల్లన్నసాగర్ పంచాయతీ ఒడవడం లేదు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో మూడేళ్ల క్రితం ఏర్పాటైన నిర్వాసితకాలనీ ప్రజలు నిత్యం భూపంచాయతీలతో సతమతమవుతున్నారు. తమకు న్యాయంగా రావాల్సిన పరిహారం, ప్యాకేజీ, ప్లాట్ల కేటాయింపులు పూర్తి కాకపోవడంతో ఆవేదన చెందుతున్నారు. 15 నెలలుగా మల్లన్న సాగర్ ముంపు గ్రామాలకు చెందిన భూనిర్వాసితులకు సంబంధించిన ప్లాట్ల కేటాయింపు రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడం, ప్యాకేజీ, పరిహారానికి సంబంధించి ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో భూనిర్వాసితులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. నిత్యం గజ్వేల్ పట్టణంలోని తహసీల్దార్, ఆర్డీవో, సిద్దిపేట ఆర్డీవో కార్యాలయం, కార్యాలయాల చుట్టూ తిరుగుతూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై పట్టించుకోవాల్సిన అధికారులు, ప్రభుత్వం స్పందించకపోవడంతో తమకు న్యాయంగా రావాల్సిన పరిహారం, ప్లాట్లు వస్తాయా... రావా.. అని ఇబ్బందులు పడుతున్నారు.



స్థలాలను దున్నేస్తున్న నిర్వాసితులు

మల్లన్నసాగర్ భూనిర్వాసితులకు సంబంధించిన ప్లాట్ల కేటాయింపులు జరగకపోవడంతో పలువురు నిర్వాసితులు గతంలో ప్లాట్ల కోసం కేటాయించిన భూమిని చదునుచేస్తున్నారు. వెంటనే భూనిర్వాసిత కాలనీకి చెందిన పలువురు ఫిర్యాదులు చేయడంతో అధికారులు అక్కడికి చేరుకొని వారిని పోలీసుల సహాయంతో పిలిపించి, సముదాయించడం తలకు మించిన భారంగా తయారయింది. తమ చేతిలో ఏమీ లేదని, ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉందని, పరిహారానికి సంబంధించిన పరిహారానికి సంబంధించిన భారీ మొత్తం నిధులు విడుదలవుతేనే ఏదైనా చేయగలుగుతామని అధికారులు చెబుతున్న నిర్వాసితులు పట్టించుకోవడం లేదు. తమ నిరీక్షణకు తెరపడడం లేదని, ప్రభుత్వాలు మారినా స్పందించడం లేదని ఆవేదన చెందుతున్నారు. పోలీసులు పిలిచి కేసులు నమోదు చేస్తామని చెబుతున్నా... నిర్వాసితులు కావడంతో తాము ఏమీ అనలేకపోతున్నామని పోలీసులు, అధికారులు వాపోతున్నారు. యువకులు మాత్రం తమపై కేసులు అయినా పర్లేదని కానీ తమకు న్యాయంగా రావాల్సిన పరిహారం, ప్యాకేజీలు పూర్తిగా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

నెరవేరని హామీ

మల్లన్నసాగర్ భూనిర్వాసితుల పునరావాస కాలనీ కోసం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ముట్రాజ్‌పల్లి, సంగాపూర్, గజ్వేల్ రెవెన్యూ గ్రామాల పరిధిలోని దాదాపు 800 ఎకరాలను గత ప్రభుత్వం సేకరించింది. ఈ క్రమంలో ముట్రాజ్‌పల్లి (లింగరాజ్‌పేట్) గ్రామస్తులు కోర్టు మెట్లు ఎక్కడంతో గతంలో కోర్టు సైతం అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసింది. భూనిర్వాసితుల కోసం మరోచోట భూయజమానులను నిర్వాసితులను చేస్తారా... అంటూ అసహనం వ్యక్తం చేసింది. ఈ క్రమంలో ముట్రాజ్‌పల్లికి సంబంధించిన భూనిర్వాసితులకు 25 ఎకరాల భూమిని పట్టా చేసి ఇస్తామని గత అధికారులు హామీ ఇచ్చారు. సదరు హామీ ఇప్పటికీ నెరవేరకపోవడంతో ముట్రాజ్‌పల్లి గ్రామస్తులు సైతం ఎదురుచూపులు చూస్తున్నారు. అధికారులు తమ మంచి సేకరించిన భూమికి బదులు పట్టా చేసి ఇస్తానన్న భూమిని వెంటనే ఇవ్వాలని వారు కోరుతున్నారు.

నిత్యం ఏదో ఓ చోట

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ముట్రాజ్‌పల్లి రెవెన్యూ గ్రామం నుంచి త్రిబుల్ ఆర్ రోడ్డుకు పోయిన భూమి మీద మిగిలిన భూమిని ఇటీవల మల్లన్నసాగర్ భూనిర్వాసిత గ్రామమైన వేముల ఘాట్ గ్రామ యువకులు చదును చేయించారు. దీంతో అదే గ్రామానికి చెందిన పలువురు అధికారులకు ఫిర్యాదు చేయడంతో వెంటనే అధికారులు స్పందించి అక్కడికి చేరుకొని పోలీసుల సహాయంతో వారిని తహసీల్దార్ కార్యాలయానికి పిలిపించారు. నిత్యం ఏదో ఒకచోట భూ నిర్వాసితులు తమకు న్యాయంగా రావాల్సిన పరిహారాల గురించి, ప్లాట్ల గురించి పోరాటం చేస్తూనే ఉన్నారు. కానీ ప్రభుత్వం నుంచి, అధికారుల నుంచి స్పందన లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

ఆరోగ్య కేంద్రంలో అనారోగ్య చెట్లు

- రాయపోల్ పీహెచ్‌సీ ఆవరణలో శ్వాసకోస వ్యాధులను పెంచే కోనోకార్పస్ చెట్లు
- తొలగించాలని ప్రజల వేడుకోలు

రాయపోల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు గ్రామీణ ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. రోగులు చికిత్సల కోసం మొదటగా సంప్రదించేది ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనే. ఈ కేంద్రాల్లో ఆరోగ్యకరమైన వాతావరణం ఉంటే రోగులకు ప్రశాంతత లభిస్తుంది. అలాంటిది మనుషులకు కీడు చేసే చెట్లు పీహెచ్‌సీ ఆవరణలో ఉంటే ఉన్న రోగం కాస్త ముదురుతుంది. ఇలాంటి పరిస్థితే రాయపోల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నెలకొన్నది. వివరాల్లోకి వెళితే.. గతంలో ఆయా గ్రామాల్లో హరితహారంలో భాగంలో పల్లె ప్రకృతి వనం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా మంచి వాతావరణం ఉంటుందని భావించి రాయపోల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కూడా పల్లె ప్రకృతి వనాన్ని ఏర్పాటు చేశారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ పల్లె ప్రకృతి వనం చుట్టూ సుమారు 150 వరకు కోనోకార్పస్ చెట్లను నాటారు. అయితే, ఈ చెట్లు మానవ ఆరోగ్యానికి హానికరం చేస్తాయని వృక్ష శాస్త్రజ్ఞులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా శ్వాసకోశ వ్యాధుల వృద్ధికి ఇవి తోడ్పాటు అందిస్తాయని పలువురు పేర్కొంటున్నారు. ఇవి గాలిలోని ఆక్సిజన్‌ను తగ్గిస్తాయని వార్తలు వెలుబడ్డాయి. ఇటీవల శాసనసభలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కోనోకార్పస్ చెట్ల దుష్పరిణామాలను వివరిస్తూ వాటిని తొలగించాలని ప్రభుత్వానికి సూచించడం గమనార్హం. అయినా,



రాయపోల్ పీహెచ్‌సీలో కోనోకార్పస్ చెట్లు

ఇక్కడ మాత్రం వందల సంఖ్యలో చెట్లు దర్శనమిస్తున్నాయి. ఆరోగ్య కేంద్రంలో ఇలా చెట్లు ఉన్నా.. అధికారులెవరూ పట్టించుకోకపోవడంతో ఆస్పత్రి వచ్చే వారు ముక్కునవేలేసుకుంటున్నారు. ఆరోగ్యాన్ని పంచాల్సిన చోట ఇలాంటి చెట్లేమిటని ఆశ్చర్యపోతు న్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రాయపోల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న కోనోకార్పస్ చెట్లను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు చర్యలు

కోనోకార్పస్ చెట్ల తొలగింపునకు గ్రామస్థులు తీర్మానం చేసి ఇస్తే ఉన్నతాధికారులకు నివేదిస్తాం. వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

- ఎంపీడీఓ బాలయ్య



అధికారులు లేరని ఆందోళన

రాజీవ్ యువ వికాసం దరఖాస్తు కోసం వచ్చిన యువకులు

శివ్వంపేట, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు రాగా, కార్యాలయంలో అధికారులు లేకపోవడంతో యువకులు నిరసనకు దిగారు. ఈ ఘటన శివ్వంపేట ఎంపీడీవో కార్యాలయం వద్ద సోమవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. రాజీవ్ యువ వికాసం పథకానికి సోమవారం చివరి గడువు అని పలు గ్రామాలకు చెందిన సుమారు 30 మంది యువకులు మీసేవలో దరఖాస్తు చేసుకుని, ఆఫ్‌లైన్‌లో ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడానికి ఎంపీడీవో కార్యాలయానికి వచ్చారు. అక్కడ అధికారులు ఎవరూ లేకపోవడంతో కొందరు వెనుదిరిగి వెళ్లిపోయారు. మరికొందరు కార్యక్రమం ముందు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ కార్యాలయంలో అధికారులు ఎవరూ లేకపోవడంతో ఆందోళనకు దిగామన్నారు. ఈ విషయంపై ఎంపీడీవోను సంప్రదించగా గడువు పొడగించినట్లు తెలిపారు.

పేరుకే మోడల్..

రవాణా సదుపాయం లేక డల్..

జిన్నారం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): రవాణా సౌకర్యం లేక మోడల్ పాఠశాల విద్య విద్యార్థులకు అందని ద్రాక్షలా మారింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో దశాబ్దం కిందట జిన్నారం, గుమ్మడిదల మండలాలకు చెందిన 28 గ్రామ పంచాయతీలకు చెందిన విద్యార్థుల కోసం నగర శివారులోని బొల్లారంలో మోడల్ పాఠశాలను ఏర్పాటు చేశారు. అయితే, బొల్లారంలో ఏర్పాటు చేసిన మోడల్ పాఠశాలలో చేరేందుకు ఉమ్మడి జిన్నారం మండలానికి చెందిన విద్యార్థులు ఏటా ప్రవేశ పరీక్షలు రాస్తున్నారు. సీటు వచ్చినా పాఠశాలకు వెళ్లేందుకు రవాణ సౌకర్యం లేకపోవటంతో స్థానిక ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలోనే చేరుతున్నారు. బొల్లారానికి సమీపంలో మియాపూర్ ఆర్టీసీ బస్ డిపో ఉంది. అయితే, ఈ డిపోనుంచి బొల్లారం మీదుగా బస్సు నడిపితే అటు విద్యార్థులతో పాటు ఇటు ఆయా గ్రామాల ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మండలంలోని గ్రామాల మీదుగా రవాణా సౌకర్యం కల్పిస్తే వచ్చే విద్యాసంవత్సరంలోనేనైనా విద్యార్థులు మోడల్ పాఠశాల, కళాశాలలో చేరే అవకాశం ఉంటుందని స్థానికులు అంటున్నారు.

ప్రమాదవశాత్తు అరటిపండ్ల గోదాం దగ్ధం



కొండపాక, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్పడగలో ఓ అరటిపండ్ల కోల్డ్ స్టోరేజ్ గోదాం ప్రమాదవశాత్తు నిప్పంటుకొని దగ్ధమైన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మర్పడగ శివారులో ఖమ్మంపల్లి రోడ్డుకు సిద్దిపేటకు చెందిన వ్యాపారులు కోల్డ్ స్టోరేజ్ నిర్వహిస్తున్నారు. సోమవారం సాయంత్రం గోదాంలో ఆకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో పరిసర వ్యవసాయ బావుల వద్ద ఉన్నవారు నీరు చల్లినప్పటికీ అదుపులోకి రాలేదు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో ఫైర్‌ఇంజన్ చేరుకొని రాత్రి వరకు మంటలను ఆర్పే ప్రయత్నం చేసింది. మంటలు అదుపులోకి రాక పూర్తిగా గోదాం కాలి పోయింది. సుమారు కోటి రూపాయల వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు పేర్కొన్నాడు.

ప్రవచనానికి వస్తే.. టెంటు కూలి గాయాలు

కల్హేర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక కార్యక్రమం కోసం ఏర్పాటు చేసిన గాలిదుమారానికి టెంట్లు, సీలింగ్ కూలి భక్తులకు గాయాలైన ఘటన సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండలంలోని వాసర్ గ్రామంలో సోమవారం జరిగింది. ఈ ప్రమాదంలో సుమారు 25 మంది గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. మహారాష్ట్రలోని నానీజీధామ్ పీఠాధిపతి నరేంద్రాచార్య మహారాజ్ పాదుకపూజ, ప్రవచన కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఇందుకోసం భారీగా టెంట్లు, సీలింగ్ ఏర్పాటు చేశారు. కార్యక్రమం కాసేపట్లో ముగుస్తుందనుకుంటున్న సమయంలో ఒక్కసారిగా గాలిదుమారం లేచింది. భక్తుల కోసం ఏర్పాటు చేసిన టెంట్లు, సీలింగ్ ఎగిరిపోవడంతో భక్తులు చెల్లాచెదురయ్యారు. టెంట్ల కోసం నాటిన ఇనుపరాడ్లు భక్తులపై పడటంతో పలువురికి గాయాలు అయ్యాయి. ఈ ప్రమాదంలో సుక్కల్‌తరి శాంతాబాయి, బిరాదర్ రాజేందర్, పాశపురం మొగులయ్య, మేతరి కమల, నాగన్‌పల్లి కౌసల్య, బిరాదర్ సవితాబాయి, పరాలే పద్మిని బాయి, సునార్ సిద్దమ్మ, జాదవ్ రాజు, మల్కపూర్ అనూషబాయి తదితరులకు గాయాలైనట్లు అక్కడి వారు చెప్పారు. ఇందులో అనూషబాయి, జాదవ్ రాజు, పద్మినీ బాయి, కౌసల్య, శాంతాబాయిలకు తీవ్రగాయాలు కావడంతో హైదరాబాద్ ఆస్పత్రికి తరలించారు. మిగిలిన వారు నారాయణఖేడ్ ప్రభుత్వ ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నారు.





కూలిన టెంట్లు.. ఆస్పత్రిలో గాయపడిన వారు

న్యూస్ బాక్స్

అట్టహాసంగా భీందాస్ మహరాజ్ జయంతి

నాగల్‌గిద్ద, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : భీందాస్‌మహరాజ్ 100వ జయంతిని మండల కేంద్రమైన నాగల్‌గిద్దలోని దత్తాత్రేయ మందిరంలో ప్రారంభించారు. ఏడురోజుల పాటు వారీకార్ భజనకారులచే సప్తాహ కార్యక్రమం కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈనెల 21న సప్తాహ ముగింపు ఉంటుందన్నారు.

అనారోగ్యంతో మాజీ ఎంపీటీసీ మృతి

కల్హేర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : సిర్గాపూర్ మండల పరిధిలోని ఖాజాపూర్ గ్రామానికి చెందిన సుల్తానాబాద్ మాజీ ఎంపీటీసీ ఆరె గయాబాయి(58) అనారోగ్యంతో సోమవారం మృతిచెందారు. ఆమె ఉమ్మడి కల్హేర్ మండలంలోని సుల్తానాబాద్ ఎంపీటీసీగా 2006 నుంచి 2011 వరకు కొనసాగారు. కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందారు. ఆమె మృతిపట్ల మాజీ ఎంపీపీ మల్లేశం సంతాపం తెలిపారు.

అట్టహాసంగా భేతాళస్వామి జాతర ప్రారంభం

అల్లాదుర్గం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : ఎంతో ప్రసిద్ధి చెందిన అల్లాదుర్గం బేతాళస్వామి జాతర సోమవారం అట్టహాసంగా ప్రారంభమైంది. ఉత్సవాల్లో భాగంగా మొదటిరోజు పట్టణంలోని పోలేరమ్మ దేవతకు రథోత్సవంతో పాటు భోనాలను నిర్వహించారు. ఇంటింట బోనాలను అలంకరించి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగిస్తూ ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలను భక్తులు అమ్మవారికి సమర్పించి వారి మొక్కులను తీర్చుకున్నారు.

భక్తిమార్గాన్ని ఎంచుకోవాలి

మునిపల్లి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : భక్తులందరూ భక్తిమార్గాన్ని ఎంచుకోవాలని ఆత్మానంద ఆశ్రమ పీఠిధిపతి భగవత్ భక్త పరాజ్ పాదగురు రాజయోగి వెంకట స్వామి అన్నారు. మండలంలోని మక్తక్యాసారంలో ఆత్మానంద ఆశ్రమ 25వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం శివలింగ నంది విగ్రహ ప్రతిష్టాపన నిర్వహించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

● 6 తులాల బంగారం, రూ.80 వేలు అపహరణ

మనోహరాబాద్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకున్నది. మనోహరాబాద్ మండలం రంగాయపల్లి గ్రామానికి చెందిన దానప్ప సత్యనారాయణ కుటుంబంతో కలిసి బంధువుల ఇంటికి వెళ్లాడు. సోమవారం వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉన్నది. ఇంట్లోకెళ్లి చూడగా ఆరు తులాల బంగారం, రూ.80 వేలు, వెండి దొంగిలించారన్నారు.

క్షతగాత్రులకు పరామర్శ

నారాయణఖేడ్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : నానీజ్ జగద్గురు నరేంద్రచార్య పాదుక దర్శనం సందర్భంగా సిర్గాపూర్ మండలం వాసర్‌లో టెంట్లు కూలి దాదాపు 10 మంది వరకు తీవ్రంగా, మరో 50 మంది వరకు స్వల్పంగా భక్తులు గాయాలు గురయ్యారు. వారిని చికిత్స నిమిత్తం నారాయణఖేడ్ వైద్యశాలలో చేర్పించారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి, మాజీ ఎంపీ బీబీపాటిల్ వేర్వేరుగా ఖేడ్ వైద్యశాలలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి, వివరాలు తెలుసుకొని వారికి మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు.

మెటీరియల్ అందజేత

గుమ్మడిదల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : జిన్నారం మండల కేంద్రానికి చెందిన అతి నారం దేవిక అనే విద్యార్థి ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పూర్తిచేసిన తరువాత డైట్ సెట్‌కు సిద్ధమవ్వాలనే లక్ష్యంతో ముందడుగు వేసింది. పేదరికం అయినా ఉన్నత చదువులో రాణించాలనే తపన పడేది. ఈ నేపథ్యంలో ఆమె మైత్రి ఫౌండేషన్ చైర్మన్ ఉదయకుమార్‌ను సంప్రదించింది. చైర్మన్ చెన్నశెట్టి ఉదయకుమార్, మైత్రి ఫౌండేషన్ తరఫున దేవికకు డైట్ సెట్, ఎన్టీఏఎస్‌ఏ పరీక్షలకు అవసరమైన పుస్తకాల మెటీరియల్‌ను అందజేశారు.

17న ఉచిత నేత్ర వైద్య శిబిరం

నారాయణఖేడ్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో 17న సత్యసాయి మందిరంలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు బాధ్యులు తెలిపారు. ఈ శిబిరంలో కంటి సమస్యలు ఉన్నవారికి ఉచితంగా చికిత్సలు చేయడమే కాకుండా ఆపరేషన్లు అవసరం ఉన్నవారికి కూడా ఉచిత ఆపరేషన్లు చేస్తామన్నారు. పూర్తి వివరాల కోసం 9676171527 నెంబరులో సంప్రదించాలన్నారు.



జహీరాబాద్: పట్టణంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేస్తున్న జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్‌షెట్కార్, ఎమ్మెల్యే మాణిక్‌రావు, మాజీ మంత్రి చంద్రశేఖర్



నారాయణఖేడ్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలవేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి



సంగారెడ్డి రూరల్: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి గౌరవ వందనం చేస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

అంబేడ్కర్‌కు ఘన నివాళి

అంబేడ్కర్ జయంతిని సంగారెడ్డి, మెదక్ జిల్లాలోని పలు మండలాల్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యేలు, అధికారులు, ప్రజాప్రతినిధులు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం అంబేడ్కర్ చేసిన సేవలను కొనియాడారు.



మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అదనపు ఎస్పీ మహేందర్



సంగారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న ఎస్పీ పంకజ్



రామచంద్రాపురం: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న హరీశ్‌రావు



చిన్నశంకరంపేట: మిర్జాపల్లిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు



నర్సాపూర్‌లో ఎమ్మెల్యే సునీతారెడ్డి ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



మెదక్ అర్బన్ : మెదక్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

దళారులకు ధాన్యం విక్రయించొద్దు: ఎమ్మెల్యే

నారాయణఖేడ్/చిన్నశంకరంపేట/చేగుంట, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించొద్దని, కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి సూచించారు. సోమవారం ఖేడ్ పరిధిలోని మండల కేంద్రమైన నిజాంపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మునిగేపల్లిలో డీసీఎంఎస్ ద్వారా జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు పండించిన పంటలను చివరి గింజ వరకు కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ పీఏసీఎస్ చైర్మన్ శోభాఅశోక్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శంకర్‌గౌడ్, మాజీ ఏఎంసీ డైరెక్టర్ రాధాకిషన్ పాల్గొన్నారు. అలాగే మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం జంగరాయి గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. చేగుంట మండలం ఇబ్రహీంపూర్ సొసైటీ పరిధిలోని మక్కరాజుపేటలో కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ వైస్ చైర్మన్ పట్నం తానీష ప్రారంభించారు.



చేగుంట: మక్కరాజుపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన వైస్ చైర్మన్ తానిషా

త్వరలో పోలీస్‌స్టేషన్, మండల కార్యాలయాలు?

● జిల్లా మంత్రుల సహకారంతో మండలాభివృద్ధి

మాసాయిపేట, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన మాసాయిపేటకు పోలీస్‌స్టేషన్‌తో పాటు మండల కార్యాలయాలు మంజూరైనట్టు తెలిసింది. మాసాయిపేట మండలంగా ఏర్పడిన రోజు పోలీస్‌స్టేషన్ భవనాన్ని పాత ప్రభుత్వ భవనంలో అప్పటి మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు. ప్రభుత్వం మారడంతో మండల కార్యాలయాలతో పాటు పోలీస్‌స్టేషన్ భవనం ఏర్పాటు వాయిదా పడుతూ వస్తున్నది. అయితే కాంగ్రెస్ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి మాసాయిపేట మండలాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లా మంత్రుల సహకారంతో సీఎం రేవంత్‌రెడ్డి వరకు మాసాయిపేట విషయాన్ని తీసుకెళ్లారు. ఇందులో భాగంగానే త్వరలోనే మండల కార్యాలయాలతో పాటు పోలీస్‌స్టేషన్ రానున్నట్లు తెలిసింది. పోలీస్‌స్టేషన్ కోసం చెట్ల తిమ్మాయపల్లి రోడ్డులోని మూడెకరాల స్థలాన్ని దాదాపు ఖరారు చేసినట్లు సమాచారం. చెట్ల తిమ్మాయపల్లి రోడ్డు ట్రిపుల్‌ఆర్ చౌరస్తాకు మాసాయిపేట స్టేషన్‌కు అతి సమీపంలో ఉండడంతో పోలీస్‌స్టేషన్‌తో పాటు లైబ్రరీ తదితర కార్యక్రమాలకు శ్రీకారం చుట్టే అవకాశం ఉన్నది.

బీఆర్‌ఎస్ హయాంలో కాంట్రాక్టర్లకే లబ్ధి

శివ్వంపేట, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కాంట్రాక్టర్లకే లబ్ధి చేకూరిందే కానీ ప్రజలకు ఎలాంటి లబ్ధి చేకూరలేదని పీసీసీ కార్యదర్శి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు అంజనేయులుగౌడ్, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి అన్నారు. కాంగ్రెస్ ఆదేశాల మేరకు అంబేడ్కర్ జయంతి సందర్భంగా 'జై బాపు జై భీమ్ జై సంవిధాన్'లో భాగంగా సోమవారం వారు కాంగ్రెస్ శ్రేణులతో కలిసి చిన్నగొట్టి ముక్ల చౌరస్తా నుంచి గోమారం వరకు సుమారు 6 కిలోమీటర్ల మేర పాదయాత్ర నిర్వహించారు. ముందుగా చిన్నగొట్టి ముక్కల చౌరస్తాలో ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలవేసి పాదయాత్ర ప్రారంభించారు. అనంతరం గ్రామంలో నాచారం నాగరాజుయాదవ్ ఏర్పాటుచేసిన ఉచిత బియ్యం భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శేష సాయిరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పులుమామిడి నవీన్‌గుప్తా, పీఏసీఎస్ చైర్మన్ వెంకటరామిరెడ్డి, పార్టీ అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్, లక్ష్మీకాంతారావు, కరుణాకర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, కమల, గణేష్ పాల్గొన్నారు.



పాదయాత్ర నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మురుగు కాలువ, సీసీరోడ్ల నిర్మాణానికి నిధులు: ఎమ్మెల్యే

వెల్దుర్తి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మానేపల్లి గ్రామంలో మురుగు కాలువ, సీసీరోడ్ల నిర్మాణానికి రూ.10 లక్షల నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానేపల్లిలో చెక్‌డ్యామ్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించడం జరిగిందన్నారు. గ్రామంలో రెండు లైన్ల రోడ్డు నిర్మాణానికి గ్రామస్థులు సహకరించాలని, గ్రామానికి బస్సు సౌకర్యం కల్పిస్తానని హామీఇచ్చారు. అలాగే గ్రామంలో అంబేడ్కర్ భవన, పాఠశాల ప్రహరీ నిర్మాణానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో వెల్దుర్తి మాజీ ఎంపీటీసీ మోహన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

అర్హులకే డబుల్ బెడ్‌రూం ఇండ్లు కేటాయించాలి

● గాంధీ చౌరస్తా వద్ద లబ్ధిదారుల ధర్నా

● ఇండ్లు పంపిణీ అయ్యేలా ఉంటాయి.

చేగుంట, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : అర్హులకే డబుల్ బెడ్‌రూం ఇండ్లు కేటాయించాలని లబ్ధిదారులు చేగుంట గాంధీ చౌక్ వద్ద అరగంటపాటు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇండ్లు నిర్మించి ఏళ్లు గడుస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అరులైన లబ్ధిదారులను గుర్తించినా ఇప్పటికీ పంపిణీ చేయడం లేదని పేర్కొన్నారు. తాము అద్దె కట్టలేని పరిస్థితిలో ఉన్నామని, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎంపీ రఘునందన్‌రావు ప్రత్యేక చొరవ తీసుకొని తమకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు పంపిణీ చేసేవిధంగా చూడాలని కోరారు. ఈ ధర్నాతో రహదారిపై భారీగా వాహనాలు నిలిచి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో వారోత్సవాలు

కంది, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని మెదక్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో సోమవారం అగ్నిమాపక భద్రతా వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ సీజీఎం ఎస్ఎస్ ప్రసాద్ జెండా ఎగురవేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ సీనియర్ అధికారులు, భద్రతా అధికారులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి

నిజాంపేట, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉంటూనే, డయల్ -100పై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ బీ.రాజేష్ పేర్కొన్నారు. మండల పరిధిలోని నందిగామ గ్రామంలో సోమవారం సైబర్ నేరాలపై ప్రజలకు, రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిచితుల నుంచి ఎస్ఎంఎస్, ఈమెయిల్, వాట్సాప్‌ల ద్వారా వచ్చే బ్లూ కలర్ లింక్స్‌ను క్లిక్‌చేస్తే మీ మొబైల్‌లోని డాటా మొత్తం సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి పోతుందని, ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండలని సూచించారు.

వేర్వేరు కారణాలతో ఐదుగురి అదృశ్యం

సంగారెడ్డి క్రైం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాల కారణంగా జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో ఒక యువతి, ఒక యువకుడు వేర్వేరుగా అదృశ్యమయ్యారు. సంగారెడ్డి పట్టణ సీఐ ఎస్.రమేష్ తెలిపిన వివరాల ప్రకారం... కుటుంబ విషయంలో భార్యతో గొడవపడి భర్త కనిపించకుండా పోయాడు. మెదక్ జిల్లా రంగంపేటకు చెందిన ఏర్పుల వెంకట్(37) కొంతకాలంగా సంగారెడ్డికి వలస వచ్చాడు. మేస్త్రి పనులు చేసుకుంటూ సంగారెడ్డి పట్టణంలోని శాంతినగర్‌లో భార్యతో కలిసి నివాసముంటున్నాడు. గతనెల 28న భార్య కవితతో గొడవ పడి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. గతనెల 28 న ఇంటినుంచి వెళ్లిన వెంకట్ రాకపోవడంతో ఎమ్మెల్సీ సంగారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.





ఏర్పుల వెంకట్(ఫైల్), బేగరి సరళ(ఫైల్)

భర్తతో గొడవపడి భార్య..

పుల్కల్ మండలం బస్వాపూర్‌కు చెందిన బేగరి సరళ(30) తన భర్త ప్రసన్న కుమమార్‌తో గొడవపడి ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. ఈనెల 9న ఆమె భర్త ప్రసన్నకుమార్ సంగారెడ్డి మంజీరానగర్‌లోని ఇంటికి వచ్చి భార్యను దూషించి గొడవపడ్డాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన సరళ అదేరోజు ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. సోమవారం ఆమె కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ రమేష్ తెలిపారు.

పిట్టలవాడలో మహిళ..

శివ్వంపేట, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : ఇంట్లో నుంచి వెళ్లిన మహిళ అదృశ్యమైన సంఘటన సికింద్లాపూర్ పిట్టలవాడలో మంగళవారం చోటుచేసుకుంది. పిట్టలవాడకు చెందిన పిట్టల సునీత(40) దినసరి కూలి. ఈనెల 6న ఇంట్లో చెప్పకుండా వెళ్లి తిరిగిరాలేదు. చుట్టుపక్కల బంధువుల దగ్గర వెతికినా ఆచూకీ లభించకపోవడంతో భర్త సురేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ మధుకర్‌రెడ్డి తెలిపారు.



సునీత(ఫైల్)

కాళ్లకల్‌లో యువతి..

మనోహరాబాద్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : యువతి అదృశ్యమైన సంఘటన కాళ్లకల్‌లో చోటు చేసుకున్నది. కాళ్లకల్ గ్రామానికి చెందిన చామంతుల మంజుల, గణేష్ దంపతులకు కూతురు నాగలక్ష్మి(19), కుమారుడు ఉన్నాడు. కూతురు పదిరోజుల నుంచి మేడ్చల్‌లోని నేషనల్ మార్ట్‌లో ఉద్యోగం చేస్తున్నది. శనివారం ఉద్యోగానికి వెళ్లి ఇంటికిరాలేదు. కుటుంబీకులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. తల్లి మంజుల ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.



నాగలక్ష్మి(ఫైల్)

సన్నబియ్యంతో పేదలకు మేలు

మనోహరాబాద్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : దేశంలో ఎక్కడా లేనివిధంగా సామాన్యుడి ఆకలి తీర్చిన ప్రభుత్వం కాంగ్రెస్సేనని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మనోహరాబాద్ మండలం కాళ్లకల్ గ్రామంలో ప్రభుత్వం పంపిణీ చేసిన సన్నబియ్యం కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం వర్గంటి యాదగిరి ఇంట్లో కుటుంబసభ్యులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి, మాజీ ఎంపీటీలు లక్ష్మీనరసింహగౌడ్, కృష్ణ, మాజీ ఉపసర్పంచ్ రాజుయాదవ్, నాయకులు పాల్గొన్నారు.



లబ్ధిదారుడి ఇంట్లో భోజనం చేస్తున్న నర్సారెడ్డి

బస్తీ దవాఖానాలో బీపీ పరీక్షలు ప్రశ్నార్థకం

● యంత్రాలు లేక వెనుదిరుగుతున్న ప్రజలు

● ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తూ ఆర్థిక ఇబ్బందులు

నారాయణఖేడ్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం పట్టణ ప్రజలకు సర్కార్ వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలనే ఆలోచనతో బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేసినా కనీసం బీపీ పరీక్షలు కూడా నిర్వహించలేని స్థితి నెలకొందని పలువురు పేర్కొంటున్నారు. నారాయణఖేడ్‌లో గత ప్రభుత్వం బస్తీ దవాఖానను పాత గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ నివాస గృహంలో ఏర్పాటుచేశారు. వైద్యాధికారితో పాటు స్టాఫ్‌నర్సును, సపోర్టింగ్ స్టాఫ్‌ను నియమించారు. వైద్యశాలకు ప్రతిరోజు 60 మంది వరకు పరీక్షల కోసం వస్తున్నారు. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల్లో అనేకమంది బీపీ సమస్యతో సతమతమవుతుంటారు. అయితే ఈ వైద్యశాలలో బీపీ పరీక్షించే యంత్రం లేకపోవడంతో పరీక్షల కోసం వచ్చినవారు నిరుత్సాహంతో వెనుదిరుగుతూ ప్రైవేటు వైద్యులను ఆశ్రయిస్తున్నారు. మందులు కూడా సకాలంలో అందుబాటులో ఉండడం లేదని చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి అన్ని చికిత్సలతోపాటు బీపీ పరీక్షల యంత్రాన్ని అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు. ఈ విషయమై బస్తీ దవాఖానా వైద్యాధికారి నిఖితను ప్రశ్నించగా గతంలో బీపీ పరీక్షల యంత్రాన్ని తెచ్చామని, అవి పాడైపోవడంతో పరీక్షలు చేయలేకపోతున్నామన్నారు. మందులన అవసరాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు తెప్పిస్తున్నామని చెప్పారు.

అన్నిరంగాల్లో కాంగ్రెస్ విఫలం: క్రాంతికిరణ్

జోగిపేట/నారాయణఖేడ్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : గత 16 నెలలుగా అన్ని రంగాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమై ప్రజలను ఇబ్బందుల పాలు చేస్తున్నదని అందోలు మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ విమర్శించారు. సోమవారం అందోలు శివారులోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో సన్నాహక సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈనెల 27న నియోజకవర్గం నుంచి వరంగల్‌కు ఆందోల్‌లోని ప్రతి గ్రామం నుంచి ముఖ్య నాయకులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు జైపాల్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు శ్రీధర్, మాజీ ఎంపీపీ రామగౌడ్, తదితరులు పాల్గొన్నారు. నారాయణఖేడ్ పట్టణంలోని వరాహి ఫంక్షన్‌హాల్‌లో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ లక్ష్మీబాయిరవీందర్‌నాయక్, పార్టీ మండల, పట్టణ అధ్యక్షుడు పరమేశ్వర్, నగేష్, నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న క్రాంతికిరణ్

రైతుల శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం: డా.ఉజ్వల్‌రెడ్డి

జహీరాబాద్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : రైతుల శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు డా.సిద్ధం ఉజ్వల్‌రెడ్డి పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం భూభారతి కార్యక్రమాన్ని ప్రారంభించిన నేపథ్యంలో మండలంలోని హుగ్గెల్లి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర పభుత్వం రైతుల ప్రయోజనార్థం కొత్త కొత్త పథకాలను తీసుకొచ్చి ఆదుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలోకాంగ్రెస్ మండలాధ్యక్షుడు నర్సింహారెడ్డి, వ్యవసాయశాఖ అధికారి లావణ్య, నాయకులు, రైతులు పాల్గొన్నారు.



నిర్మానుష్యంగా మారిన రోడ్డు

ఎండ ప్రతాపం.. రోడ్డు నిర్మానుష్యం

ఎప్పుడూ రద్దీగా ఉండే మెదక్ జిల్లా నర్సాపూర్‌లోని ఎస్‌బీఐ నుంచి పోలీస్‌స్టేషన్ ప్రధాన రోడ్డు నిర్మానుష్యంగా మారింది. సోమవారం సెలవుకావడంతో పాటు ఎండ ప్రతాపంతో ప్రజలకు బయటకు రాలేకపోతున్నారు. దీంతో మధ్యాహ్నం బోసిపోయి కనిపించింది.

- నర్సాపూర్